## క్లుప్తంగా

### అందరికీ ఉపాధి పనులు

**అంబాజీపేట:** అడిగిన ప్రతి ఒక్కరీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. బుధవారం వక్కలంక పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం గ్రామసభ ఫీల్డ్ అసిస్టెంట్ సకిలే చిరంజీవి అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో రైతులకు అవసరమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామస్తులు వాసంశెట్టి పెదబాబు, జనిపల్లి ఏడుకొండలు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, యల్లమిల్లి జయబాబు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సంఘ పెద్దలకు సన్మానం



మలికిపురంలో బ్రాహ్మణ సంఘ పెద్దలను సన్మానించిన సంఘీయులు

**మలికిపురం:** స్థానికంగా బ్రాహ్మణ సంఘ సమావేశం బుధవారం జరిగింది. సంఘానికి విశేష సేవలు అందించి ప్రస్తుతం దూర ప్రాంతాలలో ఉంటున్న సంఘ పెద్దలకు వేదికపై సన్మానం చేశారు. రిటైర్డ్ తెలుగు పండిట్ ఎంవీఎల్ నరసింహారావు, మల్లిక్, సుబ్బారావులను సత్కరించారు. సంఘ అధ్యక్షుడు కాదంబరి రామారావు మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాల్లో సంఘ పెద్దలు చురుకుగా పాల్గొని సంఘానికి గుర్తింపు తెచ్చారన్నారు. ఫణి కృష్ణ, గోనెళ్ల ఉదయభాస్కర్, విశ్వేశ్వరరావు, భాస్కర్, చంద్రశేఖర్, బులిబాబు, మద్దాలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం సోమునాయుడు

**మామిడికుదురు:** మహిళలు తమ నైపుణ్యం ద్వారా ఆర్థికంగా ప్రగతి సాధించాలని నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు అన్నారు. పాశర్లపూడిలో నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్ఈడీపీ ప్రోగ్రామ్‌లో భాగంగా మహిళలకు క్వాయర్ ఉత్పత్తులపై ఉచిత శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏజీఎం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యంతో వారికి ఉచితంగా క్వాయర్ ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈదరాడ, జనుపల్లి గ్రామాల్లో శిక్షణ కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. పాశర్లపూడిలో కొత్తగా శిక్షణ ప్రారంభించామని చెప్పారు. ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్, క్వాయర్ ఇనస్ట్రక్టర్ రమేష్ పాల్గొన్నారు.

### యువకుల రక్తదానం



నగరంలో రక్తదానం చేస్తున్న యువకుడు

**మామిడికుదురు:** నగరం గ్రామంలో జాలెం తాతరమేష్ ఆధ్వర్యంలో బుధవారం 20 మంది యువకులు రక్తదానం చేశారు. అమలాపురానికి చెందిన బుద్దాల నాగబాబు మెమోరియల్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో యువకుల నుంచి రక్తం సేకరించారు. రక్తదానం చేసిన యువకులకు బ్లడ్ బ్యాంకు ప్రశంసా పత్రాలను అందించింది. నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, జాలెం రాంబాబు, కొల్లాబత్తుల జతిన్, నల్లి కుమార్, పల్లి రాజేష్ పాల్గొన్నారు.

### చెత్త సమస్యతో ఇబ్బందులు

**అంబాజీపేట:** మాచవరం పంచాయతీలో చెత్త సమస్యపై ఇటీవల అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో వినతిపత్రం ఇచ్చినా నేటికీ అధికారులు పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ బుధవారం తెలిపారు. గ్రామంలో ప్రధాన రహదారులపై చెత్త పేరుకుపోయిందని, డ్రైనేజీల్లో మురుగు పారడం లేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలన్నారు.

### వేధింపులపై కేసు నమోదు

**కొత్తపేట:** వివాహితను వేధిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పలివెలకు చెందిన ఓ వివాహితను కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన మోటుపల్లి సుబ్రహ్మణ్యం వేధిస్తున్నాడు. దీంతో ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### శుభ్రతకు సహకరించండి

**అంబాజీపేట:** పరిసరాల శుభ్రతకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ శాంతకుమారి అన్నారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలో బుధవారం పారిశుధ్య పనులను చేపట్టారు. బ్లీచింగ్‌ను చల్లారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# అన్నిరంగాల అభివృద్ధికి ప్రాధాన్యం

**ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు**

**మామిడికుదురు:** విద్య, వైద్య తదితర రంగాల అభివృద్ధికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఈ హైస్కూల్‌కు ఎమ్మెల్యే వంట పాత్రలు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రోడ్డు, ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామని, కొత్తగా జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ అభివృద్ధి కాదా అని రాపాక ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు అండగా నిలవాలన్నారు. అనంతరం కొత్తగా నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. జల్‌జీవన్ మిషన్ పనులను త్వరితంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీ సభ్యుడు వర్ధినేని రాము, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, పీఎంసీ చైర్మన్ మట్టా వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, నాయకులు సూరిశెట్టి బాబి, చేట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

**మలికిపురంలో..**

**మలికిపురం:** రాష్ట్రంలో విద్యాభివృద్ధికి 'నాడు-నేడు' కార్యక్రమాన్ని సీఎం జగన్ అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం ఎంఈఓ కార్యాలయం వద్ద జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో పాఠశాలలకు మంజూరైన వంట పాత్రలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య ప్రజల ప్రాథమిక హక్కని, అందుకే విద్యా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మొత్తం 78 పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు బల్ల ప్రసన్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి సీతామహాలక్ష్మి, జక్కంపూడి శ్రీదేవి, సుంకర బాబ్జి, మండల జేసీఎస్ కన్వీనర్ చింతా రాజబాబు, కొల్లాబత్తుల అశోక్, నల్లి శివకుమార్, ఎంఈఓ విజయశ్రీ పాల్గొన్నారు.



మలికిపురంలో వంట పాత్రలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

### బాలికకు చేయూత

**సఖినేటిపల్లి:** గుడిమూలకు చెందిన వడ్డి సుష్మకు బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన రత్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దాత గొల్ల విజయ్ ప్రకాష్ పైమొత్తాన్ని సమకూర్చారు. బాలికకు వైద్యపరంగా పేస్ మేకర్ అమర్చాల్సి ఉండడంతో ఇందుకు అయ్యే వైద్య ఖర్చు నిమిత్తం ఈ సాయం చేశారు. సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, నాయకులు రాపాక సూర్యప్రకాష్, గొల్ల విజయ్‌శేఖర్, కోన ప్రభాకర్, తాడి సహదేవ్, నల్లి మోహన్, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టకాలం... ఆపన్నహస్తం

**పి.గన్నవరం:** మానేపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు లూటుకుర్తి నాగేశ్వరరావు అనారోగ్యంతో అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం వలంటీర్ షేక్ యాకూబ్ (రెహమాన్) తెలుసుకుని బుధవారం అమలాపురంలోని ఆసుపత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛను సొమ్మును అందించాడు. వలంటీర్ యాకూబ్‌కు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

**వలంటీర్‌కు అభినందన**

**రాజోలు:** తాటిపాక గ్రామానికి చెందిన వలంటీరు మంసాని మురళీ బుధవారం అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొపనాతి కృష్ణమూర్తికి పింఛన్ అందజేశారు. దివ్యాంగుడైన మురళీ తాటిపాక సచివాలయంలో వలంటీర్‌గా సేవలు అందిస్తున్నారు. రెండు నెలలుగా తాటిపాక నుంచి మోటార్ సైకిల్‌పై అమలాపురం వెళ్లి కృష్ణమూర్తికి పింఛన్ అందిస్తున్నారు. మురళీని పలువురు అభినందించారు.



కిమ్స్ ఆసుపత్రిలో నాగేశ్వరరావుకు పింఛను అందిస్తున్న వలంటీర్ యాకూబ్



అమలాపురం కిమ్స్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీర్ మురళీ

### చిన్నారులకు టీకాలు తప్పనిసరి

**అలమూరు:** చిన్నారులకు నిర్ణీత సమయంలో టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల డాక్టర్లు డి.మల్లిఖార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు అలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు రాజా, బి.సూర్యనారాయణ, సూపర్ వైజర్లు సేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజక్షన్లు చేశారు.

# సంక్షేమ పాలనకు అండగా నిలవాలి

**సఖినేటిపల్లి:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలంతా అండగా నిలవాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం అంతర్వేదిపాలెంలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిపై బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాలతో అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు మందపాటి రత్నం, నాయకుడు రాపాక వెంకట్‌రామ్, మాజీ సర్పంచులు నల్లి సురేంద్రరావు, ఈద రవిరెడ్డి, నాయకులు గెద్దం అమ్ములు, నల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదిపాలెంలో పథకాల బ్రోచర్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

# పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివి

**కొత్తపేట:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు మరువలేనివని అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహానికి, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డేవిడ్‌రాజు తదితరులు పూలమాలలు వేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, స్థానిక హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, మండల యువజన విభాగం సభ్యుడు బెజవాడ నారాయణరావు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ భవనంలో, సమితి రోడ్డు, పాత బస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేశారు. మండల సంఘ అధ్యక్షుడు శ్రీకాకోళ్లపు బాబి, జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు సత్యవరపు జమీందార్, సభ్యులు శ్రీకాకోళ్లపు రాధాకృష్ణ, తమ్మన సాయిప్రసాద్ పాల్గొన్నారు.

**అంబాజీపేట:** తెలుగు వారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి సాధించిన ఘనత అమరవీరుడు పొట్టి శ్రీరాములుకు దక్కుతుందని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేశారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద శ్రీరాములుకు నివాళులర్పించారు.



కొత్తపేటలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న అముడ చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు



సఖినేటిపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓలు

**సఖినేటిపల్లి:** స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఎంఈఓలు డి.కిశోర్‌కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్ఎంలు వీరాస్వామి, కనకలింగేశ్వరరావు, సుజాత, సుగుణ, సూర్యకుమారి పాల్గొన్నారు.

**ఆత్రేయపురం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాతిబుజ్జి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మండల పార్టీ కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యుడు చిలువూరి బాబిరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1న నిర్వహించాలని చక్కని నిర్ణయాన్ని తీసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎంఈఓ వరప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు ప్రసాద్, వాసుకీ, సురేష్ పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో నివాళి

**అయినవిల్లి:** ముక్తేశ్వరం సెంటర్‌లో ఆంధ్రరాష్ట్ర దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వార లక్ష్మీనరసింహరామ్, కొత్త కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పరిశీలన

**సఖినేటిపల్లి:** అంతర్వేదిలో ఏటిగట్టు వద్ద గొంది, నవా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పనితీరును బుధవారం ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు పరిశీలించారు. గొంది, నవా డ్రెయిన్‌ల ద్వారా తమ చేలల్లో ముంపునీరు దిగక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆయకట్టు రైతులు తెలపగా ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వెంటనే స్పందించారు. ఈ మేరకు జిరాయితీ భూములతో పాటు, అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానం, శివాలయానికి చెందిన వేలాది ఎకరాలకు పైన మస్య ఉన్నట్టు గుర్తించిన ఎమ్మెల్యే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే కలెక్టర్ పైరెండు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు అంతవరకూ ఉన్న తలుపులు స్థానే ఫ్లాప్ సిస్టంలో తేలికపాటి తలుపులు, సంబంధించిన గేట్ల ఏర్పాటుకు మొత్తం రూ.40 లక్షలు విడుదల చేశారు. ఈ పనులను రాజోలు హెడ్‌వర్క్స్ అధికారులు పూర్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలపై స్లూయిజ్‌లను పరిశీలించిన ఈఈ కాశీవిశ్వేశ్వరరావు తలుపులు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గోదావరి పోటు, పాటులకు తలుపులు సక్రమంగా పనిచేస్తున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో తాను పరిశీలించిన అంశాలపై కలెక్టర్‌కు ఒక నివేదిక ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట రాజోలు హెడ్‌వర్క్స్ ఏఈ టీవీఎల్ఎన్ మూర్తి, సర్పంచులు దొండపాటి రవికుమార్, దెందుకూరి శ్రీహరిరాజు ఉన్నారు.



అంతర్వేది ఏటిగట్టు వద్ద నవా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న కాశీవిశ్వేశ్వరరావు

### విఘ్నేశ్వరునికి కలెక్టర్ పూజలు



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, పాలకవర్గ సభ్యులు స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలతో కలెక్టర్ శుక్లాను ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

### నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

**పి.గన్నవరం:** మండలంలోని జి.పెదపూడి గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్ర భవనాలను గురువారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తవ్వారు.. అవస్థ తెచ్చారు

**రాజోలు:** జాతీయ రహదారి బైపాస్ రోడ్డు పనుల్లో భాగంగా చింతలపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా తూరల ఏర్పాటుకు బుధవారం రోడ్డులో ఆరు అడుగుల వెడల్పు గొయ్యి తవ్వారు. ఈ ప్రాంతంలో ఆర్అండ్‌బీ రోడ్డును క్రాస్ చేసుకుంటూ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే జాతీయ రహదారి అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకుండా నిత్యం అనేక మంది రాకపోకలు సాగించే ఆర్అండ్‌బీ రోడ్డును తవ్వేశారు. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో పలు వాహనాలు చింతలపల్లి, శివకోడు నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర వెళ్లి ఉసూరుమంటూ వెనక్కి తిరిగి రావాల్సి వచ్చింది. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని జాతీయ రహదారులు అధికారులు తెలిపారు.



ఆర్అండ్‌బీ రోడ్డును తవ్వేయడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

# సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

**ఎమ్మెల్సీ ఇజ్రాయిల్**

**పి.గన్నవరం:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాదిగలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారని, ఆయనకు సంఘీయులంతా రుణపడి ఉంటారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. పోతవరం ముగ్గు బట్టీ సెంటర్లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 11న అమలాపురంలో జరగనున్న మాదిగ ఉపకులాల రాజకీయ ఆత్మీయ కలయిక కార్యక్రమానికి లక్షలాదిగా మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. మాదిగలకు తొలిసారిగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన సీఎం జగన్‌కు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను నాయకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తవిటికి వీరాభిమన్యుడు, వి.చిన్న, కొండేటి నానిబాబు, చింతపర్తి నరసింహమూర్తి, తవిటికి ఏసురత్నం, నేలపూడి నాగరాజు, ముగ్గుబట్టీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



పోతవరంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న నాయకులు

# శబరిమలైకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

**రావులపాలెం:** రావులపాలెం, పరిసర గ్రామాల నుంచి శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులకు అద్దె ప్రాతిపదికన వారు కోరిన రూట్లలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ బుధవారం తెలిపారు. ఐదు రోజుల యాత్ర కాణిపాకం, శ్రీపురం, భవాని, ఎరుమేళి, పంబ, తిరుపతి, విజయవాడ, రావులపాలెం ఉంటున్నారు. దీనికి టిక్కెట్ ధర రూ.5 వేలు అన్నారు. ఆరు రోజుల యాత్ర కాణిపాకం, పళణి, గురు వాయూరు, ఎరుమేళి, పంబ, తిరుపతి, విజయవాడ టిక్కెట్ ధర రూ.5,500గా నిర్ణయించామన్నారు. ఏడు రోజుల యాత్ర శ్రీశైలం, మహానంది, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పంబ, పళని, శ్రీరంగం, కంచి, తిరుపతి, విజయవాడ టిక్కెట్ రూ.6 వేలుగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎనమిది రోజుల యాత్ర కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, గురువాయూర్, ఎరుమేళి, పంబ, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, కంచి, తిరుపతి, విజయవాడ, రావులపాలెంకు టిక్కెట్ ధర రూ.6500గా పెట్టామన్నారు. తొలి రోజుల టూర్‌కు టికెట్ రూ.7 వేలు అన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# రోగులకు ప్రభుత్వం బాసట

**మామిడికుదురు:** డయాలసిస్ రోగులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పాశర్లపూడి కుసుమనగర్‌కు చెందిన కుసుమ రాజారావుకు ప్రభుత్వం ద్వారా కొత్తగా మంజూరైన రూ.10 వేల డయాలసిస్ పెన్షన్‌ను ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. కోనసీమ ప్రాంతానికి చెందిన కిడ్నీ రోగులు గతంలో కాకినాడ వెళ్లాల్సి వచ్చేదని, వారికి చేరువలో ఉండే విధంగా అమలాపురంలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే అన్నారు. కిడ్నీ బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, నాయకులు కొండేటి వికాష్‌బాబు, చిక్కం బుజ్జిబాబు, గంధం లక్ష్మణరావు, కుసుమ శివకుమార్ పాల్గొన్నారు.



పాశర్లపూడిలో పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

### అతని నేత్రాలు అజరామరం



బుచ్చిరాజు (ఫైల్)

**రావులపాలెం:** రావులపాలేనికి చెందిన కుసుమంచి బుచ్చిరాజు (80) బుధవారం మృతిచెందారు. దీంతో కుమారులు తండ్రి నేత్రాలను దానం చేసేందుకు స్థానిక భవానీ ఆసుపత్రి వైద్యుడు భీమారెడ్డిని సంప్రదించారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ క్లబ్ ఐబ్యాంకు వారిని ఆయన సంప్రదించగా వైద్య బృందం వచ్చి కార్నియాలను సేకరించారు. దాత భార్య నాగమణి, కుమారులు పాపారావు, నాగ సత్యానంద సూర్రాజు రమేష్, కుమార్తె వి.నాగరత్న ఉదయశ్రీలను డాక్టర్ భీమారెడ్డి అభినందించారు.

### నేడు చొప్పెల్లలో గడప గడపకూ..

**అలమూరు:** చొప్పెల్ల గ్రామ సచివాలయం-2 పరిధి శ్రీరామ్ కాలనీలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో రెండో విడత నిర్వహించే ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.

# అభ్యంతరాలు ఉంటే తెలపండి

**పి.గన్నవరం:** ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైన నేపథ్యంలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఠాగూర్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 4, 5, వచ్చే నెల 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అర్హత ఉన్నవారు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు దొమ్మేటి దుర్గారావు, సంసాని పెద్దిరాజు, మోకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్

### నెలాఖరు వరకూ సెక్షన్-30 పొడిగింపు

**అమలాపురం టౌన్:** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అమలాపురం డివిజన్‌లో ఇప్పటికే అమలులో ఉన్న సెక్షన్-30 పోలీస్ యాక్ట్‌ను ఈ నెలాఖరు వరకూ పొడిగించినట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ బుధవారం తెలిపారు. పోలీస్ సబ్ డివిజన్‌లో ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, నిరసనల వంటివి నిర్వహించేందుకు వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. డివిజన్‌లోని అమలాపురం పట్టణం, అమలాపురం తాలూకా, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెక్షన్-30 అమలు వర్తిస్తుందని వివరించారు. ఈ విషయాన్ని డివిజన్ ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.